ఆటోడ్రైవర్ల ఆకలి కేకలు

- ఆటో డ్రైవర్లపై ఉచిత బస్సు ప్రభావం
- ఆదాయానికి గండి
- ప్రభుత్వం నుంచి భరోసా కరువు
- రోడ్డున పడుతున్నామని డ్రైవర్ల ఆవేదన
- పట్టించుకోని కూటమి సర్కార్


ఆకుమల్లలో ప్రయాణికులు లేక వేచి చూస్తున్న ఆటో డ్రైవర్లు

సంజామల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆటో డ్రైవర్ల జీవితాలను అగ్నిపరీక్షలో నెట్టేసింది. సరైన ప్రత్యామ్నాయం చూపకుండానే ఈ పథకం అమలు చేయడం వల్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తలెత్తుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగం, నిరక్షరాస్యత కారణంగా అనేక మంది యువకులు కుటుంబ పోషణ కోసం ఆటో నడిపి జీవనం సాగిస్తున్నారు. అయితే మహిళలే ఎక్కువ శాతం ఆటో ప్రయాణికులు కావడంతో, ఈ పథకం కారణంగా ఆటోలు మూలన పడే అవకాశం ఉందని డ్రైవర్లు చెబుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోనే సుమారు 1,300 ఆటోలు ఉన్నాయి. దాదాపు 1,000 కుటుంబాలు ప్రభావితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయానికి గండి

ప్రతి రోజు రూ.500 వరకు సంపాదించే ఆటో డ్రైవర్‌కి ఇప్పుడు అంత గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదు. మరోవైపు ఆటో మరమ్మతులు, ఇన్సూరెన్స్, టాక్స్‌లు, పర్మిట్లు, డీజిల్ ఖర్చులు అన్నీ భరించలేని స్థాయికి చేరాయి. రోజంతా కష్టపడి నడిపినా చేతిలో ఏమీ మిగలకపోవడంతో కుటుంబ పోషణపై భారం పడుతోందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు భరోసా కల్పించాలని వారు కోరుతున్నారు.

గత వైస్సార్‌సీపీ హయాంలో భరోసా

గత వైస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరింతగా ఆదుకుంటామని సీఎం చంద్రబాబు చెప్పినా, ఏడాది గడిచినా ఎలాంటి భరోసా లభించలేదని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లతో పాటు మెకానిక్‌లు, పెయింటర్లు, సీట్‌కవర్ వర్కర్లు, ఫ్లెక్సీలు, స్టిక్కర్ కార్మికులు వంటి అనుబంధ రంగాలపై కూడా తీవ్ర ప్రభావం పడనుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మా పొట్ట కొట్టారు



ఆటోలు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ప్రతి రోజు వచ్చే ఆదాయం ఆటో రిపేర్లు, కుటుంబ ఖర్చులకే సరిపోతుంది. కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పథకం అమలు చేయడంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పటిలా మహిళలు ఆటోలో ప్రయాణించడం లేదు. ప్రయాణికులు లేక ఆటోలు పక్కన పెట్టుకున్నాం.

–చాకలి పుల్లయ్య, డ్రైవర్, సంజామల మండలం

నియోజకవర్గంలో ఆటోల వివరాలు

మండలం	ఆటోల సంఖ్య
బనగానపల్లె	600
కోవెలకుంట్ల	294
కొలిమిగుండ్ల	150
సంజామల	126
అవుకు	130

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల జీవితం అయోమయంలో పడింది. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి. ఆటోలో ప్రయాణించేది ఎక్కువ శాతం మహిళలే. ఈ పథకం అమలుతో మహిళలు ఆటోలో రావడంలేదు. మా జీవనోపాధి కోల్పోతున్నాం. కుటుంబ పోషన బారం అవుతోంది.

–సుంకన్న, ఆటో డ్రైవర్, సంజామల

టాక్స్, ఇన్సూరెన్స్ ప్రభుత్వమే భరించాలి



ఆటో డ్రైవర్ల జీవనోపాధి దినదిన గండంగా మారింది. ఉచిత బస్సు పథకంతో డ్రైవర్లకు ఆదాయం తగ్గిపోయింది. కుంటుంబ పోషణ, ఆటో నిర్వహణ ఖర్చులు భారంగా మారింది. రోడ్డు టాక్స్, ఇన్సూరెన్సులు ప్రభుత్వమే భరించాలి. ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఆర్థికంగా చూయూతనందించాలి.

– శ్రీను, ఆటో డ్రైవర్, సంజామల

రైతులే దేశానికి బలం


జలహారతి ఇస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

డోన్ టౌన్: రైతులు బాగుంటే దేశం బాగుంటుందని, దేశం బాగుంటే ప్రజలు సుభిక్షంగా జీవిస్తారని శతవధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మ అన్నారు. శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని శనివారం డోన్ వెంకటాపురం చెరువులో శ్రీవేదమాత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అన్నదాతల సంక్షేమం, గంగా భవాని సంతృప్తి కోసం నిర్వహించిన జల హారతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయశర్మ మాట్లాడుతూ..ం పోలాల అమావాస్యను జరుపుకోవాల్సిన ఆవశ్యకతను విశదీకరించారు. రైతు క్షేమమే సమాజ శ్రేయస్సుకు పునాది అని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శంకరశర్మ, ఉపాధ్యక్షుడు కళ్లె శేషావలిశర్మ, కార్యదర్శి శ్రీనివాస్, కన్వీనర్ గంగాధర్‌శాస్త్రి, నాయకులు సాయిప్రణీత్‌శర్మ, గోపాల్‌శర్మ, రాజేశ్వరరావు, భరద్వాజశర్మ, వేశవరావు, నాగరాజన్‌శర్మ, అనురాధ, లక్ష్మీదేవి, శాంతి, శిరీష, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కోవెలకుంట్ల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సీజనల్ వ్యాధులు– నివారణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య లోపం వల్ల దోమలు ప్రబలి మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, తదితర విష జ్వరాలు ప్రబలే అస్కారం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుని దగ్గు, జలుబు, జ్వరం, తదితర వైరల్ వ్యాధులు సోకినప్పుడు వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, కృష్ణదాసు, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సంఘం నూతన కమిటీ


నూతన కమిటీ సభ్యులు

డోన్ టౌన్: మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. గుండాల గ్రామ వీఆర్‌ఏ శివశంకర వరప్రసాద్‌ను అధ్యక్షుడిగా, ఎద్దుపెంట గ్రామానికి చెందిన రవికుమార్‌ను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కామగానికుంట్ల గ్రామానికి చెందిన మహేశ్వరనాయుడు కార్యదర్శిగా, యాపదిన్నె గ్రామానికి చెందిన రంగయ్య సహాయ కార్యదర్శిగా, చనుగొండ్ల వీఆర్‌ఏ హరికృష్ణను కోశాధికారిగా ఎంపిక చేశారు. మరికొంతమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నాపరాతి గనిలో ట్రాక్టర్ బోల్తా


గనిలో వేలాడుతున్న ట్రాక్టర్


గాయపడిన శ్రీరాములు

అవుకు(కొలిమిగుండ్ల): మండల పరిధిలోని చెర్లోపల్లె సమీపంలో ఉన్న నాపరాతి గనిలో శనివారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నాపరాళ్లను లోడ్ చేసేందుకు ట్రాక్టర్ గనిలోకి వెళుతున్న సమయంలో అదుపు తప్పింది. డ్రైవర్ శ్రీరాములు ట్రాక్టర్ నుంచి గనిలోకి కిందకు పడిపోవడంతో రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ ఇంజిన్ భాగం లోతుగా ఉన్న గనిలో వేలాడుతూ ఉండిపోయింది. ప్రమాద సమయంలో డ్రైవర్ మినహా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

అటవీశాఖ సిబ్బంది ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న అటవీ ఉద్యోగులు

డోన్ టౌన్: శ్రీశైలం అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆయన అనుచరులపై చర్యలు తీసుకోవాలని డోన్ అటవీశాఖ అధికారులు, సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ రవీంద్రనాయక్, మౌలాలీ మాట్లాడుతూ..ం చట్టాలు రూపొందించే ఎమ్మెల్యేలే, చట్ట ప్రకారం విధులు నిర్వహించే సిబ్బందిపై దాడి చేయడం హేయనీయమని పేర్కొన్నారు. శ్రీశైలం అటవీశాఖ సిబ్బందిని కులం పేరుతో దూషిస్తూ, రాత్రంతా శారీరకంగా, మానసికంగా వేధించిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ అగ్రనేత సుధాకర్‌రెడ్డికి నివాళి

డోన్ టౌన్: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నల్గొండ మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి డోన్ సీపీఐ నాయకులు నివాళులర్పించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీపీఐ నేత పులిశేఖర్, చేతివృత్తిదారుల సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రామ్మోహన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.గతంలో డోన్ నుంచి పోటీ చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. సీపీఐ అనుబంధ శాఖల నాయకులు చంద్రశేఖర్, నజీర్, మాబు, కోనరామకృష్ణ, మంగలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బనగానపల్లె రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు వసుంధర ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి విశిష్టత, పర్యావరణ పరిరక్షణ గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మట్టితో తయారు చేసిన వినాయకుడిని పూజిస్తే పర్యావరణం బాగుంటుందన్నారు. వీటి వల్ల వాతావరణం కూడా కలుషితం కాదని సూచించారు. విద్యార్థులు వినాయకుడి పూజలో ఉపయోగించే 21 రకాల మొక్కలు, వాటి ప్రాముఖ్యతను ప్రదర్శనగా ఉంచి వివరించారు. అలాగే మట్టితో తయారు చేసిన వినాయకుడి ప్రతిమతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, మహమ్మద్‌గౌస్, బడేసాహెబ్, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, నీతమ్మ పాల్గొన్నారు.


ఔషధ మొక్కల గురించి వివరిస్తున్న విద్యార్థినులు

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ

సంజామల: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ రామసుబ్బయ్య అన్నారు. సంజామలలో ఎంఈఓ రమణారెడ్డితో కలిసి స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని సూచించారు.

అందరూ భాగస్వాములు కావాలి


కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేక అధికారి కళ్యాణి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో స్వచ్ఛఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు పంచాయతీ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ నగర్‌లో చెత్త, చెదారం తొలగింపు పనులు చేపట్టారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ధరణికుమారి, ఈఓపీఆర్‌డీ ప్రకాష్‌నాయుడు, వెలుగు ఏపీఎం శేఖర్, ఉపాధి ఏపీఓ శ్రీకళ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ


కొలిమిగుండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని పాఠశాల నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సేవ్‌ద ట్రీ–సేవ్‌ద వాటర్, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు వంటి నినాదాలతో ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, చంద్రమౌళీశ్వరగౌడ్ అంకిరెడ్డిపల్లెలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


బేతంచెర్ల: చేతుల పరిశుభ్రతపై అవగాహన

బేతంచెర్ల: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేక అధికారి బషీరున్నిసా బేగం, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ సూచించారు. శనివారం పట్టణంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, వైద్య సిబ్బంది, పొదుపు మహిళలు, విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలని సూచించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, చేతుల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే మండలంలోని ఆర్ కొత్తపల్లె జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం సుశీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

వినాయక చవితి శాంతిభద్రతలపై సూచనలు


మాట్లాడుతున్న అర్బన్ సీఐ ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె రూరల్: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి, అర్బన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌లు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పొదుపు భవనంలో బనగానపల్లె కేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండప నిర్వాహకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ..ం వినాయక మండపాల వద్ద ఎలాంటి అల్లర్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాలను ఏర్పాటు చేసే వారు ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మహిళా ఎస్‌ఐ కల్పన, కేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు టంగుటూరి శీనయ్య, మల్లారెడ్డి, గధంశెట్టి వేనుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కొలిమిగుండ్ల: వినాయక చవితి ఉత్సవాలను గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ రమేష్‌బాబు సూచించారు. శనివారం సాయంత్రం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి పంక్షన్ హాల్‌లో వివిధ గ్రామాల ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక చింతనతో ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. చివరి రోజు ఊరేగింపు చాలా కీలకమైందన్నారు. ఎక్కడా చిన్నపాటి అల్లర్లకు పాల్పడరాదని హెచ్చరించారు. మద్యం సేవించి గొడవలకు పాల్పడరాదన్నారు. ప్రతి గ్రామంలో పోలీసులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పక ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలని స్పష్టం చేశారు. మొదటి సారిగా కమిటీలు ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి


ప్యాపిలి: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

ప్యాపిలి: ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం వివిధ గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. గణేష్ మంటపాలను ఏర్పాటు చేసే ముందు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మండపం వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్యుత్ షాక్ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పెద్ద శబ్దాలతో పాటలు పెట్టకూడదన్నారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, నీటి కుంటల వద్దకు చిన్న పిల్లలు రాకుండా చూసుకోవాలని తెలిపారు. నిమజ్జన ఊరేగింపులో వాహనాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: డోన్-బేతంచెర్ల జాతీయ రహదారి పనుల కారణంగా ఆదివారం చిన్న మల్కాపురం 33 కేవీ ఫీడర్ లైన్ షిఫ్టింగ్ పనులు చేయనున్నారు. దీంతో చిన్న మల్కాపురం, బేతంచెర్ల మండలంలోని రంగాపురం, గూటుపల్లె సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు.. మళ్లీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇస్తామని తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో అమావాస్య పూజలు


గాడుబావి వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ


అభయాంజనేయస్వామి

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట గాడుబావి వీరాంజనేయస్వామి, గౌరిపేట ఆంజనేయ స్వామి, పలకచింత మాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాస అమావాస్య పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూరార్చన, ఆకుపూజ, మహామంగళహారతి నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సిమెంట్‌నగర్ గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ఇందూ జ్ఞానవేదిక, ప్రబోధా సేవా సమితి ఆధ్వర్యంలో బందార్లపల్లెలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు శనివారంతో ముగిశాయి. శ్రీకృష్ణుని ప్రతిమను కొలువుదీర్చి వారం పాటు త్రైత సిద్ధాంత భక్తులు పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి గ్రామానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూలతో అలంకరించిన పల్లకీపై స్వామి ప్రతిమను మేళతాళాలు, చెక్క భజన కళాకారుల ప్రదర్శన మధ్య గ్రామంలోని వీధుల మీదుగా ఊరేగించారు. త్రైత సిద్ధాంత కమిటీ సభ్యులు రామకృష్ణుడు, రాజశేఖర్, మల్లిఖార్జున, రాజు, నాగసుబ్బరాయుడు, వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉయ్యాల మహేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి, నాగమల్లేశ్వరరెడ్డి, గంగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, కామిని ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్యాపిలి: గ్రామోత్సవంలో పాల్గొన్న ఎస్‌ఐ

ఏనుగుమర్రిలో ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, ఎస్‌ఐ మధుసూదన్ హాజరయ్యారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమకు గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నిర్వాహకులు కృష్ణ, మల్లేశ్వరయ్య, అంజి, లక్ష్మీనారాయణ రెడ్డి, సుధాకర్, రమేశ్, సురేశ్, శివ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

డోన్ టౌన్: సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా బాలికలు మరింత జాగ్రత్త వహించాలని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా సూచించారు. శనివారం శక్తి టీం ఆధ్వర్యంలో ఏపీ మోడల్ స్కూల్లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగం చేస్తూ కొంతమంది సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇంటర్నెట్‌లో తెలియని లింకులను ఓపెన్ చేయవద్దని, అపరిచితులతో చాటింగ్ పేరుతో పరిచయాలు పెంచుకోవద్దని విద్యార్థులను హెచ్చరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల భవిష్యత్ నాశనం అవుతుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, కుటుంబాలపై వాటి ప్రభావాలను డిజిటల్ స్క్రీన్ ద్వారా వివరించారు. అపద సమయాల్లో 1930 (సైబర్ క్రైమ్), 100, 112 (ఎమర్జెన్సీ) నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాల దుష్పరిణామాలను తెలియజేశారు. వాటిని ప్రోత్సహించినా, హాజరైనా శిక్షార్హులేనని తెలిపారు. ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్‌ఐ రవిప్రకాష్, కానిస్టేబుల్ రంగస్వామి, శక్తి టీం సభ్యురాలు లక్ష్మి, పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి


కోవెలకుంట్ల: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


డోన్: నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రవికుమార్

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు 154 జయంతిని నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవలను కొనియాడారు. స్వరాజ్యం నా జన్మ హక్కు, సైమన్ గోబ్యాక్ అంటూ ఆంగ్లేయులకు చాతిని చూపించిన వీరుడన్నారు. ప్రతి ఒక్కరూ టంగుటూరిని ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, రమణారెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణదాసు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం

డోన్ టౌన్: టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం అని తహసీల్దార్ రవికుమార్, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ అన్నారు. ప్రకాశం పంతులు జయంతిని సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.


బురదమయంగా మారిన రోడ్డు


రోడ్డుపై ఇసుక పోయడంతో బురదలోనే వస్తున్న వాహనాలు

పట్టుతప్పితే ప్రమాదమే!

డోన్ టౌన్: పట్టణంలోని మహాలక్ష్మీ ఆస్పత్రికి వెళ్లే దారి పూర్తిగా బురదమయమై, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. కొద్ది కాలంగా ఇక్కడ కొత్త భవన నిర్మాణాలు కొనసాగుతుండడంతో, నిర్మాణ సామగ్రి రోడ్డుపై పేరుకుపోవడం రాకపోకలకు అడ్డంకిగా మారింది. అదేవిధంగా సమీప హోటల్ నీరు రోడ్డుపైకి చేరి బురదగా మారుతోంది. ఫలితంగా ఈ రహదారిలో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి మీదుగా ఆస్పత్రి, అన్నా క్యాంటీన్, మూడు పాఠశాలలు, ఒక కళాశాల, పార్క్, వెంకటాచలం ఫంక్షన్ హాల్, రియలన్స్ మార్ట్, అయ్యప్పస్వామి, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం వంటి ప్రదేశాలకు ప్రతిరోజూ వేలాదిమంది వెళ్తారు. పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులు, ఆస్పత్రికి వెళ్తున్న రోగులు, గర్భిణులు, వృద్ధులు, మహిళలు బురదలో జారి పడుతున్న ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఈ రహదారిలో ప్రయాణిస్తున్నా సమస్యను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి, కొత్త భవన సముదాయం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రహదారికి మరమ్మతు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.